క్లుప్తంగా

మాజీ కార్పొరేటర్‌కు దళితరత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న మాజీ కార్పొరేటర్ రాంచందర్

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం అందించే దళితరత్న బిరుదును మీర్‌పేట కార్పొరేషన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర చైర్మన్ ఇటిక రాజు చేతుల మీదుగా అవార్డును స్వీకరించానని తెలిపారు. తన సేవలను గుర్తించి అవార్డును అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత సంక్షేమ సమితి మీర్‌పేట అధ్యక్షుడు బైగళ్ల ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయ హుండీని మంగళవారం లెక్కించారు. గత 55 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.1 లక్షా 14 వేల 300లు వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, చింతపట్ల జ్ఞానేశ్వరచారి, పోరెడ్డి జంగారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు


భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంలా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని వినతి


పోరుదోనికుంటలో జేసీబీతో తవ్వకాలు

కందుకూరు: మండలంలోని దెబ్బడగూడ అనుబంధ గ్రామం మహ్మద్‌నగర్ పరిధిలోని పోరుడోనికుంటలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఆ గ్రామస్తులు తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ డి.జంగయ్య మాట్లాడుతూ.. పోరుడోనికుంట కట్టకు అతిసమీపంలో తవ్వకాలు చేపడుతున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే మా పట్టా భూమి అంటున్నారని తెలిపారు. ఈ విషయమై పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు గ్రామస్తులు జి.నర్సింహా, జి.శ్రీకాంత్, జి.సిమ్మయ్య, జి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కిలోమీటర్లు నరకం

- మట్టి రోడ్డుతో అవస్థలు పడుతున్న కేకే బస్తీవాసులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


కేకే బస్తీకి వెళ్లే దారి దుస్థితి

కందుకూరు: రహదారి సమస్యతో ఆ గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఊరి నుంచి ఇతర గ్రామాలకు వెళ్లి రావాలంటే వారికి తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలంలో పరిస్థితి మరీ అధ్వానంగా మారుతుంది. అయినా సంబంధిత అధికారులు తమను పట్టించుకోవడంలేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు. ఇదీ మండల పరిధిలోని జైత్వారం గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న కేకే బస్తీ వాసుల ప్రధాన సమస్య.

రాకపోకలకు అంతరాయం

కేకే బస్తీకి ఇటు జైత్వారం నుంచి అటు మహేశ్వరం రహదారి వైపు, మరోపక్క పులిమామిడి గ్రామం వైపు వెళ్లేలా రెండు కిలోమీటర్ల దూరం మేర మూడు రహదారులు ఉన్నాయి. అవి అన్నీ మట్టి రోడ్లే. ప్రస్తుతం ఆ దారుల్లో రాకపోకలకు అవకాశం లేకుండా ఉంది. మరి వర్షాకాలంలో గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లి రావాలంటే వాహనాలు తిరిగే పరిస్థితి లేదు. దీంతో ఆ గ్రామస్తులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు రహదారి నిర్మిస్తామని చెప్పి ఓట్లు వేయించుకుంటారే తప్పా ఇంత వరకు నిధులు మంజూరు చేయలేదని ఆవేదన చెందుతున్నారు అక్కడి ప్రజలు. ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బంది



మా గ్రామం నుంచి ఇటు జైత్వారం గాని, మరోవైపు మహేశ్వరం రోడ్డు వైపు గాని, పులిమామిడి వైపు గాని ఎటు వెళ్లాలన్నా చాలా ఇబ్బందిగా ఉంది. ఆ రహదారులు అంతా మట్టి రోడ్లు కావడంతో గుంతలతో తిప్పలు తప్పడంలేదు. వర్షాకాలంలో సమస్య మరీ ఎక్కువ. రెండు కిలోమీటర్లు దూరం రహదారి నిర్మించేలా నిధులు మంజూరు చేస్తే మా సమస్య పరిష్కారం అవుతుంది.

– ప్రతాప్‌రెడ్డి, కేకేబస్తీ, జైత్వారం

రహదారి నిర్మించాలి



మా గ్రామం నుంచి ఎటు వెళ్లాలన్నా, బయటి వ్యక్తులు రావాలన్నా చాలా ఇబ్బందిగా ఉంటుంది. వర్షాకాలంలో అయితే వాహనాలు కూడా తిరగలేని పరిస్థితి. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నిధులు మంజూరు చేసి రహదారి నిర్మించి మా సమస్య పరిష్కరించాలి.

– ఇన్నారెడ్డి, కేకేబస్తీ, జైత్వారం

అర్హులందరికీ ఇళ్లు అందిస్తాం

ఎంపీడీఓ శైలజ


ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శైలజ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు

మహేశ్వరం: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను అందిస్తుందని ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో 39 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆమె ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణం 400 ఫీట్లు తగ్గకుండా ఆర్‌సీసీ స్లాబుతో నిర్మాణం చేయాలని తెలిపారు. ఉత్తర్వులు వచ్చిన 30 రోజుల్లో ఇంటి నిర్మాణం పనులు మొదలుపెట్టాలని ఆమె సూచించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, పంచాయతీ కార్యదర్శి సుజాత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లాజర్, సుభాష్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ ఇర్షాద్, కారోబార్ శేఖర్, శంకర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం


ఎస్‌జీఎస్ దామోదర్‌ను సన్మానిస్తున్న మల్లేశం

చాదర్‌ఘాట్: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని అందులో ఎస్‌జీఎస్ దామోదర్ కృషి అమోఘమని హైదరాబాద్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ మల్లేశంఅన్నారు. మంగళవారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన ఎస్‌జీఎస్ దామోదర్ పుట్టినరోజుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగరంలోనే హైదరాబాద్ మార్కెట్ అభివృద్ధి పథంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు, గ్రేడ్–1 అధికారి చిలుక నర్సింహారెడ్డి, ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ముఖరమ్, వ్యాపారుల అసోషియేషన్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జెడ్సీతో సమావేశం


జెడ్సీ హేమంత్ కేశవ్‌పాటిల్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మంగళవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో సమావేశమై నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు. సింగరేణి కాలనీ నుంచి న్యూ గడ్డిఅన్నారం కాలనీ వరకు ప్రవహించే వర్షపు నీటిని పీఅండ్‌టీ కాలనీ రోడ్డు వద్ద ఉన్న రెండు మీటర్ల డయా పైపులైను కలిపాలని సూచించారు. అలాగే పాత డ్రైయిరుస్ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ పరిధిలోని అంబేద్కర్ బస్తీలో వరద నీరు పారేందుకు ఔట్‌లెట్ లేక వర్షం నీరు కాలనీలో నిలుస్తుండటంతో బస్తీవాసులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. చంపాపేట డివిజన్‌లోని డిఫెన్స్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల కోసం మరిన్ని నిధులు మంజూరు చేయలని, బైరామల్‌గూడ ఫ్లైఓవర్ కింద ఒక క్రికెట్ నెట్, బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటు చేయాలని గతంలోనే అనుమతులు తీసుకోవటం జరిగిందని యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు.వీటితో పాటు వివిధ సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జెడ్సీ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈలు కార్తీక్, శ్రీనివాస్, రమేష్‌బాబు, సీపీ శ్రీనివాస్‌యాదవ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాంసన్ పాల్గొన్నారు.

అహల్యాబాయి జీవితం అందరికీ ఆదర్శం


మాట్లాడుతున్న సమత

మన్సూరాబాద్: అహల్యాబాయి హోల్కర్ జీవిత చరిత్ర ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమత అన్నారు. అహల్యాబాయి జయంతి వేడుకల కన్వీనర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశం ఆమె పాల్గొని మాట్లాడారు. అమల్యాబాయి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఆశ్రమాలు, అనాథ శరణాలయాలు, దేవాలయాలు నిర్మించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని ఆమె స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

అన్ని కాలనీలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తా


పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: డివిజన్‌లోని అన్ని కాలనీలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో మంగళవారం ఆయన తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. గత నాలుగున్నర ఏళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సమస్యలను పరిష్కరించామని కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూర్యనాయక్, నర్సింహచారి, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, అజ్జూ, మూర్తి, నర్సింగ్, నారాయణ, వెంకటేష్, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఇషాకర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఇషాకర్

హయత్‌నగర్: షెకీనా ఫౌండేషన్ ద్వారా గత 33 ఏళ్లుగా దివ్యాంగ విద్యార్థులకు సేవలు అందిస్తున్న షెకీనా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, షెకీనా ఫెలోషిప్ పాస్టర్ చింతల ఇషాకర్‌కు డాక్టరేట్ వరించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త పాటూరి జాన్‌పాల్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. స్వయంగా దివ్యాంగుడైన ఇషాకర్ తన వైకల్యంతో కుంగిపోకుండా తోటి దివ్యాంగులకు సేవలందించి వేల మంది దివ్యాంగులకు మార్గం చూపిన వ్యక్తి ఇషాకర్ అని జాన్‌పాల్ అన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు బైబిల్ బోధన మార్గాన్ని ఎంచుకుని ఎందరికో ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. బాప్టిస్ట్ చర్చి పాస్టర్ గొల్లపల్లి మోసెస్, మండల క్రిస్టియన్ అసోషియేషన్ కార్యదర్శి కిషోర్‌బాబు, తుర్కయాంజాల్ పాస్టర్స్ అసోషియేషన్ జాయింట్ సెక్రెటరీ ఏలియారాజు, షెడ్రక్, రూతమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

వనస్థలిపురం: రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను పూర్తిగా రద్దు చేసి, రైతు పండించిన పంటకు రైతులే గిట్టుబాటు ధరలను నిర్ణయించేలా చట్టం చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏఐటీయూసీ కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాల ద్వారా సాధించిన 42 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లాభదాయకంగా మారుస్తూ వాటిలో 28 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన విధానం కార్మికుల శ్రమను దోచుకునే విధంగా ఉందని విమర్శించారు. వామపక్ష కార్మిక సంఘాల డిమాండ్లను జూలై లోపు పరిష్కరించకపోతే, జూలై 9న దేశవ్యాప్తంగా భారత్ బంద్ నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమావత్ సక్రు, ఎస్.శ్రీదేవి, మర్రి శోభన్, కె.సుజాత, భాగ్యమ్మ, ఎం.కృష్ణ, జి.నాగరాజు, శ్రీను, కిరణ్, జ్యోతి, మంగ, జయంత్, అంకన్న, కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలో సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు


సేఫ్టీ గ్రిల్స్ ప్రారంభోత్సవంలో వాసవిక్లబ్ ప్రతినిధులు

వనస్థలిపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన రెండు అంతస్తుల భవనానికి విద్యార్థుల భద్రత కోసం వాసవి క్లబ్ వనస్థలిపురం ఆధ్వర్యంలో సేఫ్టీ గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు దుర్గలత అభ్యర్థన మేరకు రెండు అంతస్తు బాల్కనీలలో రూ. లక్ష ఖర్చుతో ఏర్పాటు చేసిన సేఫ్టీ గ్రిల్స్‌ను క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రాజెక్ట్ చైర్మన్ అత్తులూరి మల్లికార్జున రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ విట్టా సాయిమోహన్, క్లబ్ అధ్యక్షుడు అల్వాల మురళీధర్‌గుప్తా, ఉషారాణి, సరాబు అనంతం, విట్టా దూరయ్య, చంద్రమౌళి గుప్తా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్‌తో స్వయం ఉపాధి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు రాజీవ్ యువ వికాస్ పేరుతో స్వయం ఉపాధి కింద రుణాలు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల అజీజ్‌నగర్ రహదారిలో డాక్టర్ అశ్విజ హరిబాబు ప్రైవేట్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఈ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన నూతన టెక్నాలజీ పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువత స్వయం ఉపాధి పొందేందుకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో మంది యువత దరఖాస్తులు చేసుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, చేవెళ్ల యూత్ బ్లాక్ మాజీ అధ్యక్షుడు ఎలిగెపల్లి శ్రీనివాస్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్ ముదిరాజ్, అజీజ్‌నగర్ మాజీ సర్పంచ్ బండ్లగూడ సంధ్యాశ్రీశైలం, మత్స్యకారుల రాష్ట్ర నాయకుడు వడ్డె సత్తయ్య, అశోక్‌యాదవ్, రామకృష్ణగౌడ్, పట్నం రాంరెడ్డి, మిట్టు, షాబా ద్‌టిల్లు, యాదగిరిచారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య


ఆకులమైలారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గోడలకు ఏర్పడ్డ తేమ


అంగన్‌వాడీ భవనం

శిథిలావస్థలో అంగన్‌వాడీ

- పెచ్చులూడుతున్న గోడలు, స్లాబులు
- వర్షం కురిసినప్పుడు గోడల నుంచి కారుతున్న నీరు
- నూతన భవనం నిర్మించాలని వినతి
- పట్టించుకోని సంబంధిత అధికారులు

కందుకూరు: శిథిలావస్థకు చేరిన భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుండటంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిసినప్పుడు స్లాబ్, గోడలు లీకవ్వడంతో పాటు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని హడలిపోతున్నారు. ఇదీ మండల పరిధిలోని ఆకులమైలారం గ్రామంలోని అంగన్‌వాడీ దుస్థితి.

పాఠశాల భవనంలోనే

ఆ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం కోసం ప్రభుత్వ పాఠశాలలోని ఓ గదిని గత కొన్నేళ్లుగా కేటాయించారు. అందులో దాదాపు 16 నుంచి 20 మంది వరకు చిన్నారులు నిత్యం ఉంటారు. వారితో పాటు గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడానికి వచ్చిపోతుంటారు. కాగా ప్రస్తుతం ఆ కేటాయించిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడలకు పగుళ్లు ఇచ్చాయి. వర్షం కురిసినప్పుడు గోడలు, స్లాబ్ నుంచి నీరు లీకై ఇబ్బందికరంగా మారుతుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు హడలిపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారింది



గ్రామంలో చిన్నారుల కోసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో గోడలు, స్లాబ్ నుంచి నీరు లీకై ఇబ్బందికరంగా ఉంటుంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడాల్సి వస్తోంది. నూతన భవనం నిర్మించాలి.

– సురేష్, స్థానికుడు, ఆకులమైలారం

కేంద్రానికి పంపాలంటే భయం



నా మనవడు, మనవరాలు అంగన్‌వాడీ కేంద్రంలోనే చదువుకుంటున్నారు. ఆ భవనం పాతబడిపోయింది. వర్షాకాలంలో గోడల్లో నుంచి వర్షం నీరు కారుతోంది. ఎప్పుడూ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. మా పిల్లలను అంగన్‌వాడీకి పంపాలంటే భయం వేస్తోంది.

– అందాలు, ఆకులమైలారం